# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 27-06-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ లో వాలంటీర్ల వ్యవస్థను రద్దు చేయలేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి శ్రీ బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు.**
2. **ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర అడ్వాన్స్ డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదలయ్యాయి.**
3. **తెలంగాణలో జూనియర్ వైద్యుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడంతో సమ్మె విరమించారని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి తెలిపారు.**
4. **ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రానున్న రెండురోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది.**
5. **ఈరోజు అంతర్జాతీయ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల దినోత్సవం ఎంఎస్ఎంఈ డే నిర్వహిస్తున్నారు.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లో వాలంటీర్ల వ్యవస్థను రద్దు చేయలేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిన్న ఆయన సాంఘిక సంక్షేమ, శాఖామంత్రి గా అధికారికంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, సచివాలయ ఉద్యోగులతో జూలై 1వ తేదీన ఇంటింటికీ సామాజిక పెన్షన్లు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. అదే విధంగా షెడ్యూలు తెగలకు చెందిన విద్యార్థులకు ఆగిపోయిన ఫీజు బకాయిలను చెల్లిస్తామన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా షెడ్యూల్డ్ కులాల సమగ్ర అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తామని మంత్రి తెలిపారు.

------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నైపుణ్యాలతో కూడిన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. నిన్న నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో విద్యార్థినిలకు మంత్రి స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విద్యను అందించడంతోపాటు మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు, స్టూడెంట్స్

కిట్స్ పంపిణీ చేస్తోందని చెప్పారు. ప్రభుత్వ బాలికల పాఠశాలలో అదనపు గదులు, వసతులను మెరుగుపరచడం తదితర అంశాలను పరిగణలోనికి తీసుకొని పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని మంత్రి పేరొన్నారు.

---------------------------

తెలంగాణ రాష్ట్ర పురోగతికి, చుట్టుపక్కల రాష్ట్రాలతో మెరుగైన అనుసంధానతకు దోహదపడే వివిధ రహదారులను పూర్తిచేసి సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర రహదారులు, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీకి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి రాష్ట్రంలోని జాతీయ రహదారుల పనులు, సంబంధిత సమస్యలపై నిన్న కేంద్రమంత్రితో సమావేశమై చర్చించారు. ప్రాంతీయ రింగు రోడ్డు దక్షిణ భాగాన్ని జాతీయ రహదారిగా ప్రకటించాలని కోరారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య కీలకమైన హైదరాబాద్-విజయవాడ-ఎన్‌హెచ్ 65 జాతీయ రహదారిని ఆరు వరుసలుగా విస్తరించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్-శ్రీశైలం మార్గంలో 62 కి.మీ. మార్గం అమ్రాబాద్ పులుల అభయారణ్యం పరిధిలో నాలుగు వరుసల ఎలివేటెడ్ కారిడార్‌కు అనుమతులు మంజూరు చేయాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి ముఖ్యంమత్రి విజ్ఞప్తి చేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదలయ్యాయి. సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను రాష్ట్ర విద్య, ఐటీ,శాఖల మంత్రి నారా లోకేష్ నిన్న రాష్ట్ర సచివాలయంలో విడుదల చేశారు. సప్లిమెంటరీలో మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు మంత్రి లోకేష్ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 3.40 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాయగా 79 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాదించారని అధికారులు పేర్కొనారు. ఫలితాలకు సంబంధించి ఇంటర్ బోర్డు వెబ్ సైట్ లో పూర్తి వివరాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఫలితాలపై పునర్ మూల్యాంకనం కోసం జూన్ 28 నుంచి జులై 4 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఇంటర్మీడియట్ బోర్డు తెలిపింది.

---------------------------

తెలంగాణ వ్యాప్తంగా జూనియర్ వైద్యులు చేపట్టిన సమ్మెను విరమించారని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. నిన్న హైదరాబాద్‌లో మంత్రి పాత్రికేయులతో మంత్రి మాట్లాడుతూ, సంక్షేమం, విద్య, ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జూనియర్ వైద్యుల న్యాయబద్ధమైన సమస్యల పరిష్కారానికి జాప్యం లేకుండా, సానుకూలంగా స్పందించి ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో సమ్మె విరమించారని చెప్పారు. గ్రీన్ ఛానెల్ ద్వారా పరిమిత వేతనాల చెల్లింపుతో పాటు ఇతర సమస్యలను పరిష్కరిస్తూ ఉత్తర్వులు జారీ చేశామన్నారు. గాంధీ వైద్య కళాశాలల్లో వసతి భవనాల నిర్మాణం సహా వివిధ పనులకు 406 కోట్ల నిధులు విడుదల చేశామని మంత్రి తెలిపారు.

---------------------------

ఒక దేశ సర్వతోముఖాభి వృద్ధిలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు పోషిస్తున్న కీలక పాత్ర పట్ల అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఈరోజు అంతర్జాతీయ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల దినోత్సవం.. ఎంఎస్ఎంఈ డే నిర్వహిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి పిలుపుమేరకు ప్రతిఏటా జూన్ 27వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. ఎంఎస్ఎంఈలకు వున్న ప్రాముఖ్యత దృష్యా ఈ రంగాన్ని గణనీయంగా అభివృద్ధి చేయాలని కేంద్రప్రభుత్వం తీవ్ర కృషిచేస్తోంది. కేంద్రప్రభుత్వ కృషితో, ప్రోత్సాహకాలతో ఇప్పటికే ఈ రంగం దేశంలో బలోపేతం అయింది. కాగా అంతర్జాతీయ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల దినోత్సవాన్ని పురస్కరించుకుని

ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈ రోజు మధ్యాహ్నం 3 గంటలకు ప్రసారమవుతుంది.

-------------------------

భారత స్వాతంత్ర్య సాధన కాంక్షను, దేశభక్తి స్ఫూర్తిని ప్రజల్లో రగిలింపచేసిన వందేమాతరం గీత రచయిత బంకించంద్ర ఛటర్జీ జయంతి ఈరోజు. 1838 జూన్ 27వ తేదీన జన్మించిన ఈ బెంగాలీ కవి... వందేమాతరం గీత రచన ద్వారా భారత ప్రజల హృదయాల్లో సుస్థిరస్థానం సంపాదించారు. ఛటర్జీ రాసిన "ఆనంద్ మఠ్" నవల్లోని వందేమాతరం గీతం స్వతంత్ర్య సంగ్రామంలో సమర శంఖంగా పనిచేసింది. భారతదేశపు ఔనత్యాన్ని తెలియజేస్తూ రాసిన ఆనంద్ మఠ్ పుస్తకంలో వందేమాతరం గేయాన్ని సంస్కృతంలో రచించారు. "వందేమాతరం భారత జాతికి బెంగాల్ సమర్పించిన విలువైన కానుకల్లో ఒకటి" అని గాంధీ మహాత్ముడే వ్యాఖ్యానించారంటే, ఈ గేయానికున్న విలువ ఏపాటిదో అర్థమవుతుంది. భారత స్వరాజ్య సంగ్రామంలో జాతి జనుల్ని ఉత్తేజపరచి, వందేమాతర గీతంతో భారతావని మొత్తాన్ని ఏకం చేసిన బంకించంద్ర చటర్జీ, 1894వ సంవత్సరం ఏప్రిల్ 8వ తేదీన తుదిశ్వాస విడిచారు.

-------------------------

శ్రీ సత్యసాయి జిల్లాలోని పెనుగొండ మున్సిపాలిటీనీ ఆంధ్రప్రదేశ్‌లో ఆదర్శవంతమైన నగర పంచాయతీగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత పేర్కొన్నారు.నిన్నజిల్లాలోని పెనుగొండలో నూతనంగా కొనుగోలు చేసిన నగర పంచాయతీ వాహనాలను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పెనుగొండ నగర పంచాయతీని పట్టణ ప్రజల సహకారంతో అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. మౌలిక సదుపాయాలు కల్పించేలా అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని మంత్రి వివరించారు.

-------------------------

తెలంగాణలో ఆషాఢ బోనాల ఉత్సవాల నిర్వహణ కోసం ప్రభుత్వం 20 కోట్ల రూపాయలను మంజూరు చేసిందని రాష్ట్ర దేవాదాయ మంత్రి కొండా సురేఖ వెల్లడించారు. బోనాల జాతర ఉత్సవాలపై రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి మంత్రి దేవాదాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ,తెలంగాణలో జూలై 7 నుండి జూలై 14 వరకు బోనాల ఉత్సవాలు జరుగుతాయన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఈ ఏడాది కూడా ఘనంగా ఉత్సవాలను నిర్వహించనున్నామని తెలిపారు. గోల్కొండ కోటలో బోనాలు సమర్పించేందుకు ప్రతి ఆదివారం, మంగళవారం, గురువారం భక్తులు వస్తారని తెలిపారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అన్ని రకాల ఏర్పాట్లు చేయనున్నామని మంత్రి పేర్కొన్నారు.

-------------------------

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాలలో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఉత్తర కోస్తా జిల్లాల్లో రానున్న రెండు రోజుల్లో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని పేర్కొంది. దక్షిణ కోస్తా రాయల సీమ జిల్లాల్లో సైతం మోస్తరు వర్షాలు పడతాయని వివరించింది.అలాగే, భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశము ఉందని, కొన్ని చోట్ల ఉరు

ములతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ పేర్కొంది. కాగా.. రాష్ట్రంలో పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి.

ద్రోణి ప్రభావంతో రానున్న రెండు రోజుల్లో తెలంగాణలో పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ రోజు ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే రేపు పలు జిల్లాలలో ఈదురు గాలులు కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ శాసనసభలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభా పక్ష నేతగా మాత్రమే గుర్తిస్తామని శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష హోదా ఇవ్వాలని రాసిన లేఖపై అమరావతిలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రధాన ప్రతిపక్ష హోదాకు తగిన శాసన సభ్యుల సంఖ్యా బలం లేనందువల్లనే ఆ గుర్తింపు ఇవ్వడం జరగదని అన్నారు. మొత్తం సభ్యుల్లో పదవ వంతు శాసనసభ్యులు ఉంటేనే ప్రతిపక్ష నేత హోదా ఇస్తారని మంత్రి వివరించారు.

======================